# ఓ నాన్న కథ

ముకుందరావుకి 18 మైళ్ల దూరంలో వుండే ఓ షుగర్ ఫ్యాక్టరీలో పని! రోజూ రానూ పోనూ 36 మైళ్లు సైకిల్ ప్రయాణం చేస్తున్నందుకు తల్లీ తండ్రీ బాధగా చూస్తున్నా... భార్య జాలి చూపిస్తున్నా ముకుంద రావుకి ఆ ప్రయాణం చేయక తప్పదు!

సొంత ఇల్లు, ఉన్న వూరూ వదిలేసి షుగర్ ఫ్యాక్టరీకి దగ్గరగా మకాం మార్చాలంటే... అతనికొచ్చే జీతానికీ, ఆ జీవితానికీ తూకం సరిపోదు. పక్షవాతం తండ్రీ, చెవుడొచ్చిన తల్లీ, కోటి కలల్తో వచ్చిన పెళ్లాం, మూడేళ్ల బాబిగాడూ అందరికీ సరిపడా ఇల్లు కావాలంటే మూడు గదులైనా వుండాలి. తన జీతం అంతా పోసినా, ఇప్పుడున్న ఇల్లు లాంటి వాటా దొరకదు. పైగా సొంత వూళ్లో గనక అయినవాళ్లూ, తెల్సున్నవాళ్లూ అవసరానికి సాయబడుతున్నారు. మాటసాయం చేస్తున్నారు. వాళ్ల

మీద ఆర్థికంగా ఆధారపడట్లేదు గనక, అందరూ మనవాడే అనుకుంటున్నారు. పిలిస్తే పలుకుతున్నారు!

36 మైళ్ల ప్రయాణం ముకుందరావుకి శ్రమ అనిపించని కారణం కూడా అదే! తను పెంద్రాళే బైల్దేరినా, ఎంత ఆలస్యంగా వచ్చినా వీధిలో అందరూ తన కుటుంబానికి కావాల్సినవాళ్లే అన్న ధైర్యం వుంది! రోజూ పని నుండి రాగానే పెళ్లాం వేణ్ణీళ్లు పెట్టి స్నానం చెయ్యమంటుంది! ఆ తర్వాత బాబిగాడు ముద్దుమాటలు చెప్తూ గోడ పట్టుకుని కాళ్లు తొక్కుతాడు- సగం పైగా అలసట పటాపంచలై పోతుంది. అదీ కాక రాత్రి పడుకోబోయేముందు భార్య జాలిగా, ప్రేమగా కాళ్లు నిమిరితే మర్నాటికి మళ్లీ శక్తి చేకూరుతుంది.

“మీరు బస్సులో వెళ్తే బావుండేది” అందోరోజు భార్య.

“ఏం... నీకు కాళ్లు పట్టటం కష్టంగా వుందా” అన్నాడు నవ్వుతూ ముకుందం.

కన్నీళ్లు తిరిగి “ఛ... ఛ... మీరు శ్రమపడుతున్నారనే నా బాధ” అని ఏదో ఇంకా చెప్పబోయేంతలో అక్కున జేర్చుకుని... “ఈ శ్రమంతా ఎవరి కోసమో కాదు కదా! మన కోసమే కదా” అంటూ ప్రేమ కురిపించాడు. ఆమె కళ్లల్లో పొంగిన వేణ్ణీళ్లు కన్నీళ్లయ్యాయి.

ముకుందం ఉద్యోగం చెరకు ఫ్యాక్టరీ దగ్గరే అయినా చెరకు ఫేక్టరీ ఉద్యోగి కాదు అతను - పానకం తీసేసిన చెరకు పిప్పి తూకానికి కొనుక్కుని పేపరు మిల్లుకి అమ్ముకునే రద్దీ రామారావు ఇలాకాలో... అతని పని!

చెరకు పిప్పిని కేజీల్లో తూపించడం, లారీల్లో వేయించడం, రవాణా చేయించడం, పేపరు మిల్లుకి అప్పజెప్పి సంతకాలు తీసుకోడం వగైరా

వగైరా పనుల్లో, సూపర్‌వైజర్ కమ్... వర్కర్ కమ్... పోర్టర్ కమ్... కమ్... రసం పిండేసిన పిప్పితో వ్యాపారం చేసే రద్దీ రామారావు ఒక జీతానికి ముగ్గురు నలుగురు చేసే పనిని పీల్చి పిండుకోడంలో ఉద్దండుడు.

జీతం - **450** రూపాయలు, రానూ పోనూ **36** మైళ్లు సైకిల్ జర్నీ, ముగ్గురు నలుగురు చేసే పనీ- చెరకు పిప్పి బతుకు!!

ఒక్కోసారి ట్రాఫిక్ మరీ ఎక్కువగా ఉన్నప్పుడో, సైకిల్ పంక్చరయినప్పుడో అనిపిస్తుంది. పెళ్లాం చెప్పినట్లు బస్సులో వెళ్తే బావుణ్ణేమో అని! నెలకో వంద రూపాయలు అదనపు భారం - పోనీ... నడక ప్రారంభించి ఎక్కడైనా ఏ పుణ్యాత్ముణ్నైనా లిఫ్ట్ అడుగుతూ అంచెలంచెలుగా గమ్యం చేరితే... అదీ లాభం లేదు! స్కూటర్ మీద వెళ్లేవాళ్లు లిఫ్ట్ అడిగినవాళ్లని చూసి... 'నో' అని కూడా చెప్పకుండా పాసైపోతుంటే అడిగినవాడు ఎంత బిక్కచచ్చిపోతుంటాడో ముకుందం కళ్లారా చూస్తుంటాడు- ముకుందం అలాంటి వాళ్లకి సైకిల్ మీద అడిగి మరీ లిఫ్ట్ ఇచ్చేవాడు... ఎదురుగాలి అయినా... మెరకదారి అయినా వెనక్కాల ఎక్కించుకుని వెళ్లేవాడు-

ఇంతవరకూ ముకుందరావుని విహంగవీక్షణం చేశాం! నిజానికి ముకుందరావు కథ ఇప్పుడు మొదలవుతుంది!!

ముకుందరావు పక్కింట్లోకి ఆమధ్య పశువుల ఆసుపత్రి డాక్టరుగారు వచ్చారు! వాళ్లకీ మూడేళ్ల కొడుకు వున్నాడు. వచ్చిన రెండు వారాల్లో ఆ కుర్రాడి పుట్టినరోజు పండగ జరిగింది. పండగలాగే చేశారు. వీధిలో పిల్లలందర్నీ పిలిచి చాక్లెట్లు పంచి పెట్టారు. డాక్టరుగారు కొడుక్కి కొత్త బట్టల్తోబాటు మూడు చక్రాల బుజ్జి సైకిల్ కొనిచ్చారు! ఆరోజు నుంచి ఆ సైకిల్ మీద డాక్టర్‌గారబ్బాయి వీధంతా ఊరేగుతుంటే పిల్లలు ఆ సైకిల్ ముట్టుకుని పులకిస్తూ... తోస్తూ... కూడా వస్తూ...

వెనక్కాల ఎక్కించుకుంటే మురిసిపోతూ... కాసేపు ముందుసీటు మీద కూచుని బెల్లు వాయించాలని సరదాపడుతూ కోలాహలంగా గడిపేవారు! కానీ... ఇంటికెళ్లాక తనకీ మూడు చక్రాల సైకిలు కావాలని పేచీ మొదలెట్టేవారు. ముకుందరావు కొడుకు పుట్టినరోజు వస్తోంది! కొడుకు పెడుతున్న పేచీకీ, పడుతున్న ముచ్చటకీ తండ్రి మాట ఇచ్చేశాడు- "వచ్చేనెల 8వ తారీఖు నీ పుట్టిన్రోజుకి మూడు చక్రాల సైకిలు కొంటా"నని... ఆ వరం వినగానే... బాబిగాడికి బ్రహ్మానందం అయింది! తండ్రిని ముద్దుపెట్టుకున్నాడు... అది ముద్దు కాదు... ప్రామిస్ చేసినందుకు సాక్ష్యపు సంతకం అనుకున్నాడు ముకుందరావు.

"ఇంకెన్ని రోజులుంది నా పుట్టినరోజు" అని రోజూ అమ్మని అడుగుతూ అంకెలూ లెక్కలూ నేర్చుకుంటున్నాడు. అప్పుడూ అప్పుడూ ఆదా చేసి దాచిన డబ్బుల్తో పిల్లాడికి కొత్త బట్టలు కొంది తల్లి- పుట్టిన రోజున పంచడానికి... చాక్లెట్స్ కోసం ఓ 10 రూపాయలు దాచి పెట్టింది.

ముకుందరావు బాబిగాడు ముద్దు పెట్టుకున్నప్పణ్నుంచీ డబ్బు కోసం తిప్పలు పడుతున్నాడు. అప్పిచ్చేవాళ్లు కనిపించలేదు- కనిపించిన వాణ్ణి అడగలేడు- నాన్నకి జబ్బు చేసినప్పుడు, ఇంటిపై పెంకులు వేయించాల్సి వచ్చినప్పుడు, భార్యకి అబార్షన్ జరిగినప్పుడూ అయిదారు వందలు పైనే తెల్సినవాళ్ల దగ్గర అప్పు చేసేశాడు. బాకీ అలాగే వుంది. ఇప్పుడు తెలియనివాళ్లు అప్పు ఇస్తారా?

కానీ బాబిగాడికి సైకిల్ కొనితీరాలి! ఎలా?

రామారావుగార్ని జీతం ఎడ్వాన్స్ అడిగాడు- జీతానికే రేపూ మాపూ అనే మనిషి అడ్వాన్స్ ఇస్తాడా? తెలుసుండీ అడిగి లేదని పించుకున్నాడు.

ఆరోజు వస్తూ వస్తూ చిన్న సైకిళ్లు అమ్మే దుకాణం దగ్గర ఆగి ఖరీదు వాకబు చేశాడు- 175 రూపాయలట!

తన దగ్గర డబ్బు లెఖ్ఖ చూసుకున్నాడు- 22 రూపాయలుంది.

అంటే... ఇంకా కనీసం 150 రూపాయలు కావాలి-

చెరకు పిప్పి పట్టికెళ్లే లారీ డ్రైవర్నీ, క్లీనర్నీ అడిగాడు- వాళ్లు గొల్లున నవ్వి "మాతో పరాసికాలేంటి సామీ" అన్నారు. వాళ్ల దృష్టిలో తను సూపర్‌వైజరు- అప్పు అడక్కూడదు- తను కూడా నవ్వు నటిస్తూ 'అడుక్కోవడానికి కూడా పనికిరాను' అనుకున్నాడు.

ముకుందానికి ఆరోజు ఆరో తారీఖని గుర్తుంది.

రేపు లేదు... ఎల్లుండే బాబిగాడి పుట్టిన్రోజు-

పశువుల డాక్టర్నీ ఆయనగారి కొడుకునీ తిట్టుకున్నాడు...

ఎవరో లిఫ్ట్ అడిగారు! సైకిలాపి ఎక్కించుకున్నాడు- ఎక్కినతను బక్క పలచగా వున్నాడు- కాబట్టి సైకిల్ జోరుగానే పోతోంది.

వాణ్ణో రెండు తన్ని వాడి జేబులో డబ్బులు ఊడలాక్కుని ఉడాయిస్తే... రేపు బుజ్జి సైకిల్ కొనేయచ్చు- తనకొచ్చిన పాడు ఆలోచనకి ముకుందానికి ముచ్చెమట్లు పోశాయి- తేరుకునేలోగానే అతను థేంక్స్ చెప్పి దిగిపోయాడు.

ముకుందం చెమట్ల మీద ఎదురు గాలి చల్లగా ప్రశాంతంగా తగిలింది- హాయిగా ఇంటికెళ్లిపోయాడు- పెళ్లాం, కొడుకూ ఎనిమిదో తారీఖు గుర్తు చేశారు. కొత్త సైకిల్ వస్తుందన్న ఆనందంలో ఆరాత్రి బాబిగాడు తండ్రి కాళ్లమీద బాలకృష్ణుడులా తాండవం చేశాడు.

మర్నాడు పొద్దున్న బైల్దేరుతున్న ముకుందరావు పడుకున్న కొడుకు బుగ్గ గిల్లి ముద్దుపెట్టుకుని 'రేపు అబ్బాయిగారికి కొత్త సైకిల్ కావాలి అంతేకదా!' అనుకుంటూ బైల్దేరాడు.

✦ ✦ ✦

మూడు చక్రాల బుజ్జి సైకిల్తో సాయంత్రం ముకుందరావు ఇంటి కొచ్చాడు- పిల్లాడికి బ్రహ్మానందం! రేపు తలంటోసుకుని, కొత్త బట్టలు కట్టుకుని, పూజ చేసి సైకిలెక్కాలని అమ్మ చెప్పిన మాటకి కట్టుబడి... నిశ్చలంగా నిద్దరోయాడు బాబిగాడు.

ఆరాత్రి భార్య "మీ సైకిలమ్మేసి వాడికి సైకిల్ కొన్నారా- రేపట్నుంచి మీకెంత కష్టం చెప్పండి" అంది.

ముకుందరావుకి తన కష్టం తెల్సు... కానీ నవ్వేస్తూ "బస్సులో అయితే ఇంకో గంట లేటుగా బైల్దేరచ్చు- గంట ముందే నీ ముందు వాలిపోవచ్చు" అన్నాడు భార్యని దగ్గరకి లాక్కుంటూ- భార్య కన్నీళ్లు- ఆనందబాష్పాలు కాదు!!

మర్నాడు బాబిగాడు తలంటోసుకుని, కొత్త బట్టలు కట్టుకుని సైకిల్కి పూజ చేసి ఆనందంగా తిరుగుతుంటే... మురిసిపోతున్న ముకుందరావు "ఒరేయ్... నీ సైకిల్ మీద నన్ను మా ఆఫీసు వరకూ దింపుతావురా" అని అడిగాడు-

"అమ్మో... నా సైకిల్ ఎవర్నీ ఎక్కనివ్వను- దూరం... దూరం" అని బెల్ వాయించాడు బాబిగాడు.

ఇప్పుడు తల్లీతండ్రీ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అవి ఖచ్చితంగా ఆనందబాష్పాలే!!

